

విత్తనంపై పెత్తనం!

- ఏపీ సీడ్స్ సంస్థ తీరుపై సర్వత్రా విమర్శలు
- వ్యాపారుల నుంచి వేరుశనగ సేకరణ
- క్వింటానికి రూ.9,500 చెల్లిస్తున్న ప్రభుత్వం
- రైతులకు వ్యాపారులు ఇస్తున్నది రూ.7 వేలే..
- క్వింటంపై రూ.2 వేల లాభం పొందుతున్న వ్యాపారులు
- ఉమ్మడి జిల్లాకు 16,500 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు
- 16,500 క్వింటాళ్లపై రూ.3 కోట్ల దాకా లాభం
- ఇంత అన్యాయమా అంటున్న అన్నదాతలు
- తమ నుంచే కొనుగోలు చేయాలని డిమాండ్



ప్యాపిలి మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు నెట్టేకల్లు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వేరుశనగ కాయలను అమ్మకానికి తెచ్చాడు. వ్యాపారులు క్వింటానికి రూ.6,500 మాత్రమే చెల్లించారు. గత రబీలో రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశానని, దాదాపు రూ.80వేల దాకా ఖర్చు వచ్చిందని తెలిపాడు. వ్యాపారి ఇచ్చిన ధరతో పెట్టుబడి ఖర్చు కూడా చేతికందే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏపీ సీడ్స్ అధికారులు నేరుగా వేరుశనగ కాయలు కొనుగోలు చేస్తే తమకు మంచి ధర లభిస్తుందని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం జిల్లాలో వేరుశనగకాయలను మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన రైతులంతా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.



కర్నూలు(అగ్రికల్చర్), మే 21: ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాల సేకరణలో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో కొంత మొత్తంలో రాయితీపై వేరుశనగ విత్తనాలను అందించేందు కోసం భారీగా నిధులు వెచ్చిస్తోంది. అయితే.. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేకపోయినా వ్యాపారులు, అధికారులు నాయకులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో రైతులు పండించిన వేరుశనగ విత్తనాలను అమ్మకానికి మార్కెట్ యార్డులకు తీసుకు వస్తున్నారు. నాణ్యత కలిగిన క్వింటం విత్తనాలకు వ్యాపారులు రూ.7 వేలు చెల్లిస్తున్నారు. ఇదే క్వింటం వేరుశనగ విత్తనాలపై ఏపీ సీడ్స్ సంస్థ వ్యాపారులకు రూ.9,500 చెల్లిస్తోంది. దీంతో వ్యాపారులకు క్వింటంపై రూ.2500 మిగులుతోంది. ఏపీ సీడ్స్ సంస్థ నేరుగా రైతుల నుంచే విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర అందడమే కాకుండా ప్రభుత్వానికి క్వింటంపై సుమారు రూ.2 వేల దాకా మిగులుతుంది. బహిరంగ మార్కెట్‌లో లభించే ధర కంటే వ్యాపారులకు ప్రభుత్వం చెల్లించే ధర ఏకంగా రూ.9,500 పెంచిన విషయంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాయితీ విత్తనాల్లో ఏటా కోతే..!

ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాల్లో వేరుశనగ రైతులకు సరిపడా విత్తనాలను ఇవ్వడం లేదు. రాబోయే ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేస్తున్న రైతులకు గత సంవత్సరం కంటే దాదాపు మూడు వేలకు పైగా క్వింటాళ్ల విత్తనాన్ని కోత పెట్టారు. గత సంవత్సరం 18 వేల క్వింటాళ్లకుగాను 13 వేల విత్తనాలను మాత్రమే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో వేరుశనగను దాదాపు 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. ప్రభుత్వం మాత్రం యేటా ఆ నాలుగో వంతు విస్తీర్ణానికి మాత్రమే రాయితీ విత్తనాలను కేటాయిస్తూ వస్తోంది. కనీసం ప్రభుత్వం మొత్తం పంట సాగులో సగం విస్తీర్ణానికైనా రాయితీ విత్తనాలను అందిస్తుందని భావించారు. అయితే వారి ఆశలపై నీళ్ల చల్లుతూ నాలుగో వంతు విస్తీర్ణానికి మాత్రమే విత్తనాలను కేటాయించడంపై అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.

● రైతుల ప్రయోజనం మాటున లాభం పొందుతున్న వ్యాపారులు



నాణ్యమైన విత్తనాలను 40 నుంచి 50 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పితే.. ఈ వ్యవహారంలో వ్యాపారులు, రాజకీయ నాయకులు, అధికారులే ఎక్కువ లాభం పొందుతున్నారు. మార్కెట్ యార్డులో క్వింటం వేరుశనగ విత్తనకాయల ధర రూ.7వేలు మాత్రమే ఉంటే.. వ్యాపారులకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధర రూ.9,500 కావడం దారుణం. ఏపీ సీడ్స్ సంస్థ డైరెక్టుగా మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొంటే రైతులకు లాభం చేకూర్చడమే కాకుండా ప్రభుత్వానికి కూడా భారం పడకుండా ఉంటుంది. ఈ విషయంపై అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి:

● నాణ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తాం



ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రధాన పంటలకు సంబంధించి కొన్ని రకాల విత్తనాలను రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 40 నుంచి 50 శాతం రాయితీపై అందిస్తాం. విత్తనాల సేకరణ ప్రక్రియ బాధ్యత ఏపీ సీడ్స్ సంస్థదే. మేం ఆ విత్తనాలు నాణ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తాము. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు నాసిరకం విత్తనాలను పంపిణీ చేయం. ఎక్కడైనా నాసిరకం విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందితే.. వెంటనే వాటిని వాపసు తీసుకుని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాము. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వరలక్ష్మి, జేడీ

ఉమ్మడి జిల్లాకు 16,500 క్వింటాళ్లు

కర్నూలు జిల్లాకు రాయితీ వేరుశనగ విత్తనాలు 14వేలు క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 2,500 క్వింటాళ్లు మొత్తం 16,500 క్వింటాళ్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం వేరుశనగ విత్తనాల ధర రూ.7 వేలకు మించలేదు. వ్యాపారులకు చెల్లిస్తున్న రూ.9,500 ధరతో పోలిస్తే.. క్లీనింగ్, ట్రాన్స్‌పోర్టు తదితర ఖర్చులకు రూ.500 క్వింటానికి పోను వ్యాపారికి క్వింటానికి రూ.2వేల దాకా మిగులుతుంది. ఈ లెక్కన 16,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలపై ఒక నెల వ్యవధిలోనే రూ.3 కోట్ల దాకా లాభం చేకూరుతోంది. సంవత్సరంపాటు కష్టపడితే.. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదని, వాటికి కూడా గిట్టుబాటు ధర అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు క్వింటంపై రూ.7వేలు చెల్లించడానికి సవాలక్ష సాకులు చూపుతున్నారని రైతులు వాపోతున్నారు.

● రాయితీ విత్తన కొనుగోలులో దోపిడీ ఇలా..!



ఏటా ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కొన్ని పంటలకు సంబంధించిన విత్తనాలను వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి రైతులకు 40 నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తోంది. ఏపీ సీడ్స్ సంస్థకు ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పగిస్తూ వస్తోంది. నిబంధనల ప్రకారం రైతుల నుంచే మేలు రకం వేరుశనగ విత్తనాలను ఉత్పత్తి చేయించి వాటిని గిట్టుబాటు ధరకు ఏపీ సీడ్స్ సంస్థ కొనుగోలు చేయాలి. అయితే వివిధ కారణాల వల్ల గత కొన్ని సంవత్సరాలుగా ఏపీ సీడ్స్ సంస్థ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఈ విషయాన్ని మట్టిలో కలిపేసింది. రైతుల నుంచి కొనుగోలు చేస్తే తమకేమి వస్తుందని అధికారంలో ఉన్న పాలకులు భావించి వ్యాపారుల నుంచే కొనుగోలు చేయాలని ఏపీ సీడ్స్ సంస్థపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే ఏపీ సీడ్స్ సంస్థ రైతుల నుంచి కాకుండా వ్యాపారుల నుంచే వేరుశనగ విత్తన కాయలను కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదేశించిన మేరకు రైతులకు రాయితీపై పంపిణీ చేస్తోంది. దీంతో ఏపీ సీడ్స్ సంస్థ రాయితీ విత్తనాల సేకరణ కోసం వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఇదే అదునుగా స్థానిక వ్యాపారులు తెలంగాణలోని గద్వాల, వనపర్తి, కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల్లో గద్దల్లా వాలిపోతున్నారు. వివిధ కారణాలు చూపుతూ రైతుల నుంచి క్వింటానికి రూ.7వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం వ్యాపారులకు రూ.9,500 చెల్లించడం దారుణమని రైతులు మండిపడుతున్నారు. దీని వల్ల తమకు రాయితీ విత్తనాల కొనుగోలులో భారం ఎక్కువ పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 21: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి కొనసాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యుయేల్ మంగళవారం తెలిపారు. జిల్లాలో 17,458 మంది విద్యార్థులు పది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. ఈ విద్యార్థుల కోసం 69 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు డీఈవో వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్యలు వస్తే కంట్రోల్ రూం.నెంబర్ 9885716544, 9000822394 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

● ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యాశెట్టి మంగళవారం తెలిపారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 22,943 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 15,981 మంది ఉన్నారు. ఇందులో జనరల్ కోర్సుల విద్యార్థులు 15,076 మంది కాగా, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 905 మంది ఉన్నారన్నారు. ఈ విద్యార్థుల కోసం 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రెండో సంవత్సరం విద్యార్థులు 6962 మంది ఉన్నారు. ఇందులో జనరల్ కోర్సుల విద్యార్థులు 6194 మంది కాగా, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 768 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆర్‌ఐవో తెలిపారు

ఉదయం 8 గంటలకే కౌంటింగ్ షురూ



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కర్నూలు(కలెక్టరేట్), మే 21: జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఉదయం 4 గంటలకే పోస్టల్ బ్యాలెట్‌లను జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ హాల్లోకి చేర్చుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ సంబంధిత నియోజకవర్గాల అసెంబ్లీ కౌంటింగ్ ప్రక్రియ లైఫ్ సైన్స్ బ్లాక్ ప్రత్యేక రూమ్స్‌లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ 14 టేబుళ్ల మీద జరుగుతుందన్నారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను ఫార్మ్-18 ద్వారా నియమించుకోవాలని సూచించారు. ఒక ఏజెంటును ఒక టేబుల్‌కు మాత్రమే కేటాయించాలని అన్నారు. జూన్ 1వ తేదీ నాటికి కౌంటింగ్ ఏజెంట్ల నియామకం పూర్తి కావాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కర్నూలు, ఆదోని అసెంబ్లీ పార్లమెంటు ఈవీఎం యంత్రాలను లైఫ్ సైన్స్ బ్లాక్‌లో ఉంచామన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పాణ్యం అసెంబ్లీ, పార్లమెంటు ఈవీఎం యంత్రాలను ఇంజనీరింగ్ బ్లాకులో ఉంచగా, మంత్రాలయం, పత్తికొండ అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను లైబ్రరీ బ్లాకుల్లో భద్రపరచినట్లు కలెక్టర్ వెల్లడించారు. డీఆర్వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీ జి.కృష్ణకాంత్ ఇతర అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



మంత్రాలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్

మంత్రాలయం, మే 21: మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ న్యాపతి విజయ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈయనకు శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు ఘన స్వాగతం పలికారు. ముందుగా జడ్జి న్యాపతి విజయ్ గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు జడ్జికి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ గోపినాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, రంగస్వామి, బిందు మాధవ్, వ్యాసరాజార్ తదితరులు ఉన్నారు.

గాలి వాన

రుద్రవరం, మే 21 : రుద్రవరం మండలంలో సోమవారం రాత్రి తీవ్రమైన గాలి వానతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఉరుములు మెరుపులతో రుద్రవరం నుంచి ఆర్‌అండ్‌బీ రహదారిలో రెడ్డిపల్లె మెట్ట, నాగలవరం గ్రామాల సమీపంలో చెట్లు విరిగి రహదారి వెంట పడ్డాయి. ఎన్నో ఏళ్ల నుంచి బాటసారులకు నీడనిచ్చిన భారీ వృక్షాలు గాలి వానకు నేలకూలి పడ్డాయి. అహోబిలం నుంచి మహానంది వెళ్లే యాత్రికుల వాహనాలు నిలిచిపోయాయి. కూలిపోయిన చెట్లను స్థానికులు తొలగించాక యథావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి.

గెలిచేదెవరు?

- పత్తికొండ అసెంబ్లీ విజయంపై జోరుగా బెట్టింగులు
- గెలుపు అవకాశాలపై ఎవరి అంచనాలు వారివే



పత్తికొండ, మే 21 : పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుపై పలువురు బెట్టింగులు కాస్తున్నారు. ఇరు వైపుల నాయకులు పందేలు కాసి తమ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో మొత్తం ఓటర్లు 2,23,603 మంది ఉండగా 1,90,009 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గ పరిధిలో 84.98 శాతం ఓటింగ్ నమోదు అయింది. 255 పోలింగ్ కేంద్రాలు ఉన్న నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలలో 90 శాతం పైచిలుకు ఓటింగ్ నమోదైంది. వలస వల్ల ఊర్లు ఖాళీగా కావడంతో గ్రామాల్లో 60 శాతానికి మించి పోలింగ్ కాదేమోనన్న అనుమానం అభ్యర్థుల్లో ఉండేది. అయితే వలస కూలీలు పోలింగ్ రోజు గ్రామాలకు చేరుకుని ఓటు వేశారు. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాలలో కొత్త ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. దీంతో గత ఎన్నికలతో పోల్చుకుంటే పోలింగ్ శాతం పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో తమ పార్టీ అభ్యర్థి విజయంపై వైసీపీ, టీడీపీ నాయకులు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. రూ. లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు.

డబ్బు పంపిణీ ఇబ్బందులపైనే వైసీపీ ఆశలు..

ఎన్నికలకు పదిరోజుల ముందు నుండి నియోజకవర్గంలోని గ్రామాల్లో టీడీపీ జోరందుకుంది. స్థానిక సీనియర్ నాయకులతోపాటు యువకులు బాధ్యత తీసుకుని పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారంలోకి దిగారు. దీంతో 10 నుండి 15వేల మెజార్టీతో టీడీపీ ఈ ఎన్నికలలో విజయం సాధించడం ఖాయమని సంకేతాలు వెలువడ్డాయి. అయితే కొన్ని గ్రామాల్లో టీడీపీ ఓటర్లకు డబ్బు పంపిణీ చేయలేకపోయిందని, దీంతో ఆ గ్రామాల్లో ఓటర్లు తమ పార్టీకే ఓట్లు వేశారని వైసీపీ వర్గాలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దీనికి తోడు వెల్దుర్తి, పత్తికొండ పట్టణాలు తమకు బలంగా ఉన్నాయని భారీ మెజర్టీతో తమ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కాగా తమకు కంచుకోట అయిన పత్తికొండలో ఈసారి తిరిగి తాము జెండా ఎగరేయడం ఖాయమని పందేలకు దిగుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు సహించలేక ప్రజలు ఈ ఎన్నికలలో టీడీపీని గెలిపించేందుకు స్వచ్ఛందంగా ఓటు వేశారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇది రూ. లక్షల్లో బెట్టింగ్ కాసే స్థాయికి చేరుకుంది. నాయకుని ఆర్థిక స్థాయిని బట్టి రూ. లక్ష మొదలుకుని పది లక్షల వరకు ఒక్కొక్కరూ బెట్టింగ్‌లు కట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా పత్తికొండ నియోజకవర్గంలో గెలుపోటములపై జిల్లా కేంద్రంలో సైతం నాయకులు జోరుగా బెట్టింగ్‌లు కాస్తున్నట్లు సమాచారం.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.7

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : ....ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లి				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితి, కల్లూరు (మం.), కర్నూలు -518002.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి కూలీల నిరసన

అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణ



ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

కొలిమిగుండ్ల రూరల్, మే 21: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తమను వేధిస్తోందంటూ కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు నిరసనకు దిగారు. మంగళవారం ఉపాధి పనుల వద్ద నుంచి నేరుగా కొలిమిగుండ్ల ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని నిరసన చేపట్టారు. వారం రోజులు పని చేసినా కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే హాజరు వేస్తూ గిట్టుబాటు కూలీ లేకుండా చూస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఫీల్డ్ అసిస్టెంట్ తమపై వ్యక్తిగత దూషణలకు దిగుతూ అవమానిస్తోందని ఆరోపించారు. మస్టర్లు ఇచ్చిన సమయంలో ఒక్కో కూలీ నుండి రూ.100 డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులంతా తనకే మద్దతు ఇస్తారని, ఎవ్వరికైనా చెప్పుకోండి అంటూ ఫీల్డ్ అసిస్టెంట్ హెచ్చరించినట్లు ఉపాధి కూలీలు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిగా విచారణ చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో ఉపాధి కూలీలు వెనుదిరిగి వెళ్లిపోయారు.

చనుగొండ్లలో చిరుత సంచారం

● భయాందోళనలో గ్రామస్థులు



చనుగొండ్ల గ్రామస్థులతో మాట్లాడుతున్న ఫారెస్టు సిబ్బంది | చనుగొండ్ల గ్రామ పరిసరాల కొండరాళ్ల మధ్య చిరుత

డోన్(రూరల్), మే 21: మండలంలోని చనుగొండ్ల గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గ్రామ పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలిసి భయాందోళనకు గురవుతున్నారు. అక్కడ ఉన్న కొండరాళ్ల మధ్య చిరుత ప్రసవించిందని, కూనలను చూసేందుకు ఆ ప్రాంతంలో చిరుత రెండు రోజులుగా సంచరిస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామ పరిసరాల్లో గొర్రెలు, పశువుల కాపరులు, చిరుత సంచారాన్ని గమనించి తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో అప్రమత్తమైన ఫారెస్టు అధికారులు, సిబ్బందిని చనుగొండ్లకు పంపించారు. డోన్ ఫారెస్ట రేంజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

ఆలూరు, మే 21: ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామంలో వీధి కుక్కల దాడిలో మంగళవారం ములుగుందం హోతురప్పకు చెందిన 12 గొర్రెలు మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ. లక్ష మేర ఉందని రైతు హోతురప్ప ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, మే 21: మండలంలోని నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర వాహనాల తనిఖీలో భాగంగా ఎస్‌ఐ తిమ్మయ్య మంగళవారం కర్ణాటక మద్యం పట్టుకున్నారు. ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన గొల్ల రామకృష్ణ కర్ణాటక ప్రాంతమైన తలమారి దగ్గర నుంచి బైక్‌పై కర్ణాటక ప్యాకెట్లను తీసుకుని వస్తుండగా ఆయన నుంచి మద్యం, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో సోమశేఖర్, మల్లి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

చాగలమర్రి, మే 21: చాగలమర్రి గ్రామంలోని చింతలచెరువు రహదారిలో నివసిస్తున్న వెంకటసుబ్బమ్మ (52) పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మలకు ఇద్దరు సంతానం. భర్త చంద్రశేఖర్‌రెడ్డి తనను బంధువుల ఇంటికి పంపలేదని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. కుటుంబసభ్యులు స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బనగానపల్లె, మే 21: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన సావిత్రి (45) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బనగానపల్లె పోలీసులు మంగళవారం తెలిపారు. భాగ్యవంతుడు భార్య సావిత్రి ఇంట్లో విద్యుత్ మోటార్‌ను ఆఫ్ చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భర్త భాగ్యవంతుడి ఫిర్యాదు మేరకు బనగానపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఇరువురు కుమారులు ఉన్నారు.

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి: జేసీ



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), మే 21: పాణ్యం నియోజకవర్గం ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు కౌంటింగ్‌కు సంబంధించిన ఏజెంట్ల ఏర్పాటు కోసం ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పాణ్యం నియోజకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాకులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్స్ లెక్కించడానికి ప్రత్యేక గదిలో 6 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6 టేబుల్స్‌కు ఆరుగురు ఏజెంట్లను నియోమించుకోవచ్చన్నారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వెబ్‌సైట్‌లో అభిషేకానంతరం టికెట్లు

శ్రీశైలం, మే 21: శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం భక్తులకు రూ.500 స్వామివారి అభిషేకానంతర దర్శనం టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'మల్లన్న సేవాకర్తలపై అదనపు భారం' కథనంపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు స్పందించారు. దేవస్థానం వెబ్‌సైట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని దేవస్థానం ఐటీ విభాగం సిబ్బందిని ఆదేశించారు. దీంతో మంగళవారం నుంచి వెబ్‌సైట్ ద్వారా మళ్లీ అభిషేకానంతరం టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి కలకలం

- పల్లెల్లో బానిసలవుతున్న యువకులు
- కర్ణాటక పోలీసుల అదుపులో ఆదోని మండలవాసులు
- 50 కిలోలకు పైగా గంజాయి స్వాధీనం
- మిరప తోటలో గంజాయి మొక్కల సాగు
- ఆదోని ప్రాంతంలో కొరవడిన పోలీసుల నిఘా



గంజాయిని సీజ్ చేసి తీసుకెళ్తున్న బళ్లారి పోలీసులు

ఆదోని, మే 21:

గంజాయి మత్తు పల్లెలను కమ్మేస్తోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. తక్కువ ధరతో ఎక్కువ మత్తు ఇవ్వడంతో, యువత గంజాయి వైపునకు ఆకర్షితులవుతున్నారు. యవ్వన దశలోనే మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి మత్తు, ఇప్పుడు పల్లెలకు విస్తరించి యువతకు సులువుగా లభిస్తోంది. యువతను పెడదారుల్లో పడేలా చేస్తోంది. జీవితాలను నాశనం చేసే గంజాయి మత్తును యువత ఒక ఫ్యాషన్‌గా భావిస్తోంది. కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని సంతేకూడ్లూరు గ్రామంలో మంగళవారం భారీ ఎత్తున గంజాయి లభ్యమైంది. కర్ణాటక పోలీసులు చాకచక్యంగా బయటపెట్టారు. కర్ణాటక పోలీసులు వచ్చి చెప్పే వరకు ఆదోని పోలీసులకు గంజాయి సాగు, విక్రయాలపై ఏమాత్రం తెలియకపోవడం గమనార్హం.

● రెండేళ్లుగా గుట్టుగా గంజాయి

ఆదోని మండలంలోని సంతేకూడ్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు రవి, చంద్ర అనే వ్యక్తి తన మిరపపంటలోని కొంతభాగంలో గంజాయి మొక్కలను సాగు చేయడం ప్రారంభించారు. ఆ గంజాయిని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఇటీవల కర్ణాటక ప్రాంతంలో గంజాయి విచ్చలవిడిగా లభిస్తుండటంతో కర్ణాటక రాష్ట్రం బళ్లారి పోలీసులు నిఘా ఉంచారు. బళ్లారి నగరంలోని కౌలుబజార్‌లో గంజాయి మత్తులో జోగుతున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన సంతేకూడ్లూరు గ్రామానికి చెందిన వ్యక్తి రవి, చంద్ర అనే వ్యక్తులు తమకు గంజాయిని విక్రయించారని సదరు యువకుడు బళ్లారి కౌలుబజార్ పోలీసుల ఎదుట అంగీకరించాడు.

హుటాహుటిన చేరుకున్న బళ్లారి పోలీసులు

విషయం తెలియగానే బళ్లారిలోని కౌలుబజార్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సీఐ ధరమట్టి, ఎస్‌ఐ వెంకటస్వామి, సిబ్బంది కృష్ణ, వీరేష్, రామనగౌడ్, సోమప్ప, శివపుత్రలు మంగళవారం మధ్యాహ్నం ఆదోనికి చేరుకున్నారు. అక్కడి నుంచి సంతేకూడ్లూరు గ్రామంలోని అన్నదమ్ములు రవి, చంద్రల ఇంటికి చేరుకున్నారు. వారి ఇంటిని కర్ణాటక పోలీసులు సోదా చేయగా దాదాపు రూ.2 కోట్ల విలువైన 50 కిలోల గంజాయి బస్తాలు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న రవి, చంద్రలను అరెస్టు చేశారు. గంజాయి విక్రేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బళ్లారి జిల్లాకు చెందిన సీఐ ధరమట్టి వెల్లడించారు.

● మిరప తోటలో..

సంతేకూడ్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు రవి, చంద్ర గత కొన్నేళ్లుగా తమ మిరపపంట తోటలో గంజాయి మొక్కలను గుట్టుగా సాగు చేసేవారు. పైకి రైతులుగా అందరితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ గుట్టుగా తమ పొలంలో గంజాయి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. గంజాయి మొక్కలున్న ప్రాంతానికి కూలీలతో పాటు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు. అలా పండించిన గంజాయిని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ గంజాయి సాగుతో రూ.కోట్లలో సంపాదించినట్లు సమాచారం.

● మత్తు బానిసకు జీవితాలు చిత్తు..

ఎంతో బంగారు భవిష్యత్తు కలిగిన యువకులు మాదకద్రవ్యాల మత్తుకు ఆకర్షితులై కేసుల పాలవుతున్నారు. అంతేకాక వారి తల్లిదండ్రులను శోకసంద్రంలోకి నెడుతున్నారు. యువకులు మత్తులో జల్సాలు చేయడానికి తప్పటడుగులు వేస్తూ, నేర ప్రవృత్తి అలవరుచుకుంటున్నారు. సరదా కోసం అలవాటైన వ్యసనాలు కాస్త, వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. ఆదోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో చాలామంది వ్యక్తులు గంజాయిని తీసుకుంటున్నా ఆదోని పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క సంతేకూడ్లూరు గ్రామంలోనే కాదు, గుట్టుచప్పుడు కాకుండా చాలా గ్రామాల్లో మిరపపంటలో అంతర్ పంటగా గంజాయిని సాగు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆదోనితో పాటు పలు గ్రామాల్లో సైతం అక్రమార్కులు గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తుంటే, మరికొందరు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలను తమ ఇళ్ల వద్దే పెంచుకోవడం సంచలనంగా మారింది.



సంతేకూడ్లూరు గ్రామంలో 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న బళ్లారి పోలీసులు



గంజాయి విక్రయదారుడు చంద్రను అదుపులోకి తీసుకెళ్తున్న బళ్లారి పోలీసులు



గంజాయిలో ప్రధాన పాత్ర పోషించిన రవి



పట్టుబడిన గంజాయిని బళ్లారికి తరలిస్తున్న దృశ్యం

స్థిర ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి



బనగానపల్లె, మే 21: స్థిరమైన ఆదాయమార్గాలపై యువరైతులు దృష్టి సారించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం హైదరాబాద్ జాతీయ వ్యవసాయ పరిశోధన, శిక్షణా యాజమాన్య సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గ్రామీణ యువతకు లాభదాయకమైన పొట్టేళ్ళు, మేకల పెంపకంపై శిక్షణా తరగతులు మంగళవారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో 5 రోజుల పాటు శిక్షణా తరగతులు కెవికె కోఆర్డినేటర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయంతో ఖచ్చితమైన ఆదాయం రావడం కష్టసాధ్యమని కనుక వ్యవసాయ అనుబంధ రంగం అయిన జీవాల పెంపకంపై యువత దృష్టి సారించాలన్నారు. గొర్రెలు, జీవాల పెంపకంతో శాస్త్రీయ పద్ధతులను అనుసరించి గొర్రెల పెంపకాన్ని వ్యాపారాత్మకంగా మలుచుకొని సుస్థిర ఆదాయ మార్గంగా మలుచుకోవాలన్నారు. వ్యవసాయం సంఘటితంగా చేసుకొని దళారీ వ్యవస్థ బారి నుంచి బయట పడాలన్నారు. అప్పుడే మెరుగైన ధరకు పంట కొనుగోలు చేయవచ్చని సూచించారు. ప్రిన్సిపాల్ సైంటిస్టు బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో 50 శాతం పొట్టేళ్లు, మేకల మాంసం మన తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్పత్తి అవుతోందన్నారు. వాటి డిమాండ్ పెరుగుతున్నందున యువత సబ్సిడీ కింద జీవాల పెంపకం లాభదాయకంగా మార్చుకోవాలన్నారు. సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి మాట్లాడుతూ యువత వ్యవసాయ కూలీలుగా కాకుండా స్వయం ఉపాధి అవకాశమైన జీవాల పెంపకాన్ని వ్యాపారంగా మలుచుకొని ఆదాయ మార్గాలు పెంచుకోవాలని కోరారు. డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవాలు, కోళ్ల పెంపకం ద్వారా యువత స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లాభదాయకంగా సాంద్రపద్ధతిలో జీవాల పెంపకం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ సురేశ్‌కుమార్, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మి ప్రియ, నందికొట్కూరు డివిజన్ యువరైతులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు మార్కుల జాబితా చాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 21: 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందే విద్యార్థుల నుంచి మార్కుల జాబితా, లేదా ఆధార్‌కార్డు కాపీ ఇస్తే చాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి మంగళవారం తెలిపారు. అడ్మిషన్ల కోసం ఒరిజినల్ టీసీ, పాస్ సర్టిఫికెట్లు తీసుకురావాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని ప్రిన్సిపాళ్లకు ఆయన సూచించారు.

ఖాతాలు ఖాళీ

● బ్యాంకులో నిలువలను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు

● ఆత్మకూరు ప్రాంతంలో వరుస మోసాలు



బ్యాంకు ఖాతా నుంచి రూ.50 వేలు నష్టపోయిన మహెబూబ్



మోసాలకు వేదికగా మారిన ఆత్మకూరు/నందికొట్కూరు సమాచారం వాట్సాప్ గ్రూప్

ఆత్మకూరు, మే 21: ఆత్మకూరు పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన మహెబూబ్ బ్యాంకు అకౌంట్‌లో రూ.50వేలు ఉండగా సోమవారం సాయంత్రం రూ.49,999 వేరే బ్యాంకు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మంగళవారం ఉదయాన్నే ఆయన తన బ్యాంకు ఖాతా ఉన్న ఆత్మకూరు యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌కి వెళ్లి అధికారులకు విషయం చెప్పారు. వారు తమకేమి సంబంధం లేదని చేతులెత్తేశారు. చివరకు ఆయన ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. 1903 సైబర్ క్రైమ్స్ విభాగానికి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేశారు. గత కొద్ది రోజులుగా ఆత్మకూరు ప్రాంతంలో ఇదే తరహాలో బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నట్లు తెలిసింది. బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం ఉండటం లేదని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో మరో మోసం :

ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో వాట్సాప్ వేదికగా కొందరు మోసాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. సుమారు 550 మందికిపైగా సభ్యులతో ఆత్మకూరు, నందికొట్కూరు సమాచారం పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అందులో రచన రచన అనే పేరుతో 9381295474, కీర్తి కీర్తి అనే పేరుతో 9390999349 నంబర్లు మాత్రమే అడ్మిన్లుగా ఉన్నాయి. ఈ రెండు పేర్ల మీదుగా ప్రతిరోజు గ్రూపులో రూ.1000 ఫోన్‌పే చేస్తే ఆఫర్ కింద రూ.1,0500 పది నిమిషాల్లో క్రెడిట్ చేస్తామని, అలాగే రూ.1500 ఫోన్‌పే చేస్తే రూ.18,500 క్రెడిట్ చేస్తామని మెసేజ్‌లు పెడుతున్నారు. ఆ రెండు నంబర్లకు కాల్ చేస్తే నంబర్లు పనిచేయడం లేదు. కేవలం వాట్సాప్ కాల్స్, మెసేజ్‌లు మాత్రమే వెళ్తున్నాయి. అలా అని వాట్సాప్ కాల్ చేసినా వారు స్పందించడం లేదు. కేవలం మెసేజ్‌లకు మాత్రమే రిప్లై ఇస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని ప్రశ్నించే వారి పేర్లను గ్రూప్ నుంచే అడ్మిన్లుగా ఉన్న ఈ ఇద్దరు తొలగిస్తున్నారు. అయితే ఈ గ్రూపులో ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాలకు చెందిన పోలీసు, ఇతర శాఖల అధికారులు, మీడియా ప్రతినిధుల నంబర్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ నేరంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

కోసిగి, కౌతాళం మండలాలు కీలకం

● మంత్రాలయం గెలుపుపై అంచనాల్లో పార్టీలు

● విజయావకాశాలపై అభ్యర్థుల ఆశలు



మంత్రాలయం, మే 21: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో గెలుపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గంలో విజయానికి రెండు మండలాలు కీలకంగా మారనున్నాయి. టీడీపీ నుంచి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా.. నేనా అన్న రీతిలో పోలింగ్ జరిగింది. అయితే కోసిగి, కౌతాళం మండలాల ఓటర్లే తమ భవితవ్యాన్ని నిర్ణయిస్తాయన్న ధీమాను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు ఉన్నప్పటికీ ప్రశాంత ఓటింగ్ నమోదుపై నాయకులు గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. కోసిగి మండలంలో 83.39 శాతం, కౌతాళం మండలం 84.44 శాతం ఓటింగ్ నమోదైంది. ఇందులో కోసిగి మండలం 46,620 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. కౌతాళం నుంచి 49,439 మంది ఓటేశారు. టీడీపీ నాయకులు ఈ రెండు మండలాల నుంచి వచ్చే మెజారిటీ పైనే గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ధీటుగా వైసీపీ నాయకులు సైతం కోసిగి, కౌతాళంలో పోటాపోటీగా జరిగినా పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల్లో మెజారిటీ తమకే వస్తుందన్న ఆశతో ఉన్నారు. గత ఎన్నికల్లో పెద్దకడుబూరు మండలంలో వైసీపీకి పదివేల ఓట్లకు పైగా మెజార్టీ వచ్చింది. ఇప్పుడు అదే మండలంలో వైసీపీకి ఐదు వేల దాకా మెజార్టీ వస్తుందంటూ సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రధానంగా బీసీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు కోసిగి, కౌతాళం మండలాలపైనే ఉండటంతో గెలుపు ఓటములు ఆ మండలాలే ప్రధాన కీలకం కానున్నాయనీ రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు.



ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ


ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఓ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 21: జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ తేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు, అవసరమైన ఫెన్సింగ్ పనులు, బారికేడ్లు, కుర్చీలు, విధులకు వచ్చే సిబ్బందికి తాగునీరు, ఇంకా కావాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు, సిబ్బంది లెక్కింపు కేంద్రంలోకి వచ్చేందుకు వేర్వేరు మార్గాలు ఉండాలని సూచించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అవసరమైన ఫెన్సింగ్, కుర్చీలు, టేబుళ్ల ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఆర్అండ్‌బీ డీఈ భారతి, కార్పొరేషన్ ఏఈ జనార్దన్ ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు, మే 21: మండలంలోని కేతవరం, గార్గేయపురం మధ్యలో జరుగుతున్న పైపులైన్ పనులను వెంటనే నిలిపి వేసి, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జి. రామకృష్ణతోపాటు నాయకులు నాగన్న, శ్రీధర్, స్థానిక రైతులు పైప్‌లైన్ పనులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా, వారికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ఏడాది రైతులందరికీ నోటీసుల ద్వారా భూములు కోల్పోతున్న వారి అభిప్రాయాలు తెలియజేయాలని, అలాగే అప్పటి ఆర్డీవో రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. రైతుల ఖాతాల్లో నష్టపరిహారాన్ని ఖాతాల్లో జమ చేసిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నష్టపరిహారం చెల్లించకుండా పైపులైన్ పనులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పనుల వద్ద కూడా ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా రోడ్డు పక్కలోనే 10-15 అడుగుల గుంతలు తీశారని, రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు, నాగరాజు, మద్దిలేటి, శ్రీనివాసుల శెట్టి, సిద్దయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి



నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), మే 21: రైతు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో చేతివృత్తిదారుల రాష్ట్ర కార్యదర్శి కే.రామాంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంబోలం శ్రీనివాస రావులు నాగేశ్వర రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ నదిజలాలకు సంబంధించి ఏపీ హక్కులు, సాగునీటి పారుదల ప్రాజెక్టు సాధనపై నాగేశ్వరరావు నిర్విరామంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో బీసన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరు, మే 21: రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.ఎన్. అశోక్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు సదస్సు వ్యవసాయ ప్రదర్శనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త అశోక్ కుమార్ వేసవి దుక్కులు ప్రాముఖ్యత, ఆధునిక వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. శాస్త్రవేత్తలు డా.రమేష్ నాయక్, డా. టి. సిరి చందనలు పత్తిలో వచ్చే తెగుళ్లు, నివారణ, భూసార పరీక్షలపై వివరించారు.

వైభవంగా నారసింహుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

కోడుమూరు(రూరల్), మే 21: మండలంలోని ముడుమలగుర్తిలో మంగళవారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, కుంకుమార్చన, హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి కల్యాణ వేదికపైకి చేర్చారు. పండితుల వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ విష్ణువర్ధన్‌రెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. దీంతో భక్తులు రథాన్ని ఎదురు మండపం వరకు లాగి తిరిగి ఆలయం చేర్చారు. రాత్రి చిన్నారుల డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీ అలరించింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి రంగన్నస్వామి, ప్రహ్లాదరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లేష్, మధు, గోకారి పాల్గొన్నారు.

● **నేడు బండలాగు పోటీ:** నరసింహస్వామి వేడుకల సందర్భంగా బుధవారం 6 పళ్ల పాలబండ ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు నగదు దాతలు అందిస్తారని తెలిపారు.

కమనీయం.. చెన్నకేశవుడి కల్యాణం


ఓర్వకల్లులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, మే 21: మండల కేంద్రమైన ఓర్వకల్లులో చెన్నకేశవస్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం తెల్లవారు జామున శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ చైర్మన్ వాసు దేవరెడ్డి, ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అర్చకులు విష్ణుశర్మ, నారాయణ శర్మ పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ వాసు దేవరెడ్డి దంపతులు, ఈవో మద్దిలేటి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ కల్యాణోత్సవానికి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, తోట కృష్ణారెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, కురువ పెద్దయ్య, ధర్మ కర్తలు దేవేంద్రరెడ్డి, పి.సులోచన, తిరుమలేష్, రామాంజినమ్మ, పీసీ సులోచనమ్మ, వెంకటలక్ష్మి, భక్తులు హాజరయ్యారు. సాయంత్రం దేవయాగం, బలిహరణ పూజలు, శేషావాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నన్నూరులో మద్దిలేటి నరసింహ స్వామి కల్యాణం: మండలంలోని నన్నూరు గ్రామంలోని మద్దిలేటి స్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు నాగసంద శర్మ ఆధ్వర్యం లో పురోహితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, గణపతి పూజ, పుణ్య హావాచనం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు కళ్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


నన్నూరులో..

ఓపీ కోసం బారులు


ఓపీ టికెట్ల కోసం ఉదయం 8.30 గంటలకు బారులు తీరిన రోగులు

కర్నూలు(హాస్పిటల్), మే 21: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఓపీ తీసుకునేందుకు నిరీక్షించాల్సి వస్తోంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓపీ కోసం రోగులు ఓపీ కౌంటర్ల వదకద బారులు తీరారు. ఉదయం 8.30 గంటలకే రోడ్డు పైకి రోగులు క్యూలో నిలబడ్డారు. రోగులు రోడ్డుపైన నిలబడటంతో వాటిపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోగులను నియంత్రించాల్సిన సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు ప్రేక్షకపాత్ర వహించడంతో వాహనదారులు, అత్యవసర రోగులు ఇబ్బంది పడ్డారు. ఓపీ టికెట్ల కోసం కౌంటర్ల దగ్గర గంటల తరబడి రోగులు పడిగాపులు కాశారు. మరిన్ని అదనపు ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేయాలని రోగులు అధికారులను కోరుతున్నారు.

టెక్నాలజీకి పునాదులు వేసింది రాజీవ్ గాంధీనే

డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), మే 21: టెక్నాలజీ రంగానికి పునాదులు వేసింది మాజీ ప్రధాని రాజీవ్ గాంధీనేనని డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందడానికి ఆ యన చేసిన కృషి మరువలేనిదన్నారు. 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సుకే యువతకు ఓటు హక్కు కల్పించారని, దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల రూపురేఖలు మార్చారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఎమ్మెల్యే అభ్యర్థులు జీలాని బాషా, మురళీకృష్ణ, ఖాసీం వలి, కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంత రత్నం మాదిగ, ఉపాధ్యక్షుడు బీ.బతుకన్న, లాజరస్, షేక్ ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి

కర్నూలు(లీగల్), మే 21: న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి మంగళవారం డిమాండ్ చేసింది బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ పరిమితిని రూ.10లక్షలకు పెంచాలని, న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్‌ను వర్తింపజేయాలని, న్యాయ వాదులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.10వేల స్టయిఫండ్ చెల్లించాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పాలూరి రవి గువేరా, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు, ఉపాధ్యక్షుడు నిత్యజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

సన్నకారు రైతులు పండ్లతోటలపై దృష్టి పెట్టాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

సి.బెళగల్, మే 21: సన్నకారు రైతులు పండ్లతోటలపై దృష్టి పెట్టాలని ఈవోఆర్డీ సందీప్ సూచించారు. మంగళవారం మండలంలోని ఇనగండ్ల గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లోని బీసీ, ఎస్సీ కులాల సన్నకారులు ప్రభుత్వం నుంచి అందజేసే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వంద రోజులు ఉపాధి పనులను ఉపయోగించుకున్న ఎస్సీ, బీసీ వర్గాల వారికి ప్రభుత్వం కల్పించే ఉపాధి పథకంలో భాగంగా ఫారం పాండు, రైతులకు అనుకూలమైన చోట పనులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవోఆర్డీ వెంట ఏపీవో లక్ష్మన్న, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

బోధనేతర పనులను ఎత్తివేయాలి: యూటీఎఫ్


మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 21: రాబోయే విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులకు కేవలం విద్యార్థులకు బోధన సమయం ఉండేలా చూడాలని యూటీ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రసాద్ పర్యటించి సంఘం నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒకే సిల బస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతులకు సంబంధించిన ప్రాథమిక పాఠశాలను ఒకే చోట పెట్టాలన్నారు. జీవో నెం.117ను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 23వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 1998, 2008 డీఎస్సీ ద్వారా నియామకమైన ఎంటీఎస్ ఉపాధ్యాయులను, గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణం


కుటుంబ వైద్యవిధానం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత

కల్లూరు, మే 21: ప్రజల జీవనశైలిలో మార్పుల వల్లే అధిక రక్తపోటుకు కారణమని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం అధికారి హేమలత అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కే.మార్కాపురంలో ఆమె కుటుంబ వైద్యవిధానం కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా హేమలత మాట్లాడుతూ ప్రజలు సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో రక్తపోటును దూరం చేయవచ్చని అన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఉప్పు తక్కువగా వినియోగించి పాలు, పండ్లు, గుడ్లు ముడిధాన్యాలు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మోతీలాల్ నాయక్, సామాజిక ఆరోగ్య అధికారి ఫరీదా, సిబ్బంది పాల్గొన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, మే 21: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం వైశాఖ త్రయోదశి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలతోపాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● మంత్రాలయం మండలంలోని మాధవరంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాది పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పైబావి నర్సిరెడ్డి, శ్రీనివాసులు, మోహన్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణలో అలసత్వం వద్దు

పత్తికొండ, మే 21: ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమయ్యే రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పత్తికొండ మండల వ్యవసాయాధికారి వెంకట్రాముడు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు తదితర విషయాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక పంపాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2,850 టన్నులు వేరుశనగ విత్తనాలు అవసరం ఉందని ముందస్తు నివేదికలు పంపామని చెప్పారు. అందులోభాగంగా జిల్లా అధికారులు మొదటి విడతగా 1,000 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించారన్నారు. వేరుశనగ విత్తనాలు క్వింటం ధర 9,500 కాగా ప్రభుత్వం 40శాతం సబ్సిడీ భరిస్తోందని తెలిపారు. సబ్సిడీ పోను క్వింటం విత్తనాలకు రైతులు 5,700 చెల్లించాలన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదు


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ హనుమంతయ్య

గూడూరు, మే 21: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, అలాగే జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ జరగనుందని, ఆ తర్వాత కూడా అన్ని పార్టీల వారు శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదని గూడూరు ఎస్ఐ హనుమంతయ్య అన్నారు. మంగళవారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ హనుమంతయ్య టీడీపీ, వైసీపీ నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ఎవ్వరూ ఘర్షణల జోలికి వెళ్లరాదన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే క్షమించం


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

సి.బెళగల్, మే 21: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే క్షమించే ప్రసక్తే లేదని సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోలకల్లు, సిబెళగల్, తిమ్మనదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లోని టీడీపీ నాయకులతో ఆయన సమావేశమ్యారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాలలో టీడీపీ నాయకులు, రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఊరుకోమన్నారు. అలాగే గ్రామాలలో మద్యం, పేకాట, గుట్కా వంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసమావేశంలో మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, సర్పంచ్ రామంజినేయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఆస్పరి, మే 21: మండల పరిధిలోని చుక్కనహళ్లి గ్రామ సమీపంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప మంగళవారం తెలిపారు. పత్తికొండ మండలం అటికలగుండు గ్రామానికి చెందిన అయ్యన్నపై వ్యక్తిగత కక్షతో, అదే గ్రామానికి చెందిన మస్తాన్, రమేష్‌లతో పాటు మరికొందరు ఆస్పరి మండలం చొక్కానహళ్లి గ్రామ సమీపంలో దాడి చేశారు. గాయపడ్డ అయ్యన్నను ఆదోని ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టండి

కర్నూలు(కలెక్టరేట్), మే 21: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఓట్ల లెక్కింపు ముందు తర్వాత శాంతి భద్రతలు కాపాడటానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సమయంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకలో అనుమతులు పొంది ఉన్న పనుల అమలుకు సంబంధించి పూడికతీత పనులు, వ్యవసాయ సంబంధిత పనులు, నీటి సరఫరా సంబంధిత పనులు, పంట పొలాల అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కాన్ఫరెన్స్ సమావేశానికి డీఆర్వో మధుసూదన్‌రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **విధులకు హాజరు కానీ వారిపై చర్యలకు ఆదేశం**

ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో విధులకు హాజరు కానీ వారిపై చరయలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 79 మంది ఉపాధ్యాయులు, 21 మంది ఇతర శాఖల చెందిన అధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారు. ఎన్నికల విధులకు ఎందుకు హాజరు కాలేదని సంబంధిత అధికారులు మంగళవారం వారిని వివరణ కోరారు. వివరణ ఇవ్వని వారిపై సస్పెండ్ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

● నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు, 19 రౌండ్లు ● సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు

ఆదోని, మే 21: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. మంగళ వారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజ కీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ నిర్వహణపై మే నెల చివరిలోపు ఫారం-18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లను దరఖాస్తు చేసుకోవాలని రాజకీ య పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఆదోని నియోజకవర్గానికి సంబంధించి 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 14 టేబుళ్లు ఏర్పాటు చేయ నున్నామని, 19 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుం దని వివరించారు. ఈవీఎం మిషన్స్ కౌంటింగ్ కంటే ముందుగా, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ లెక్కింపు జరుగుతుందని తెలియజేశారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి ఒక టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లను జిల్లా ఎన్నికల అధికారి ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా సిబ్బంది ని కేటాయిస్తారని చెప్పారు. మే 24, 31 తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంపీడీవో విజయశేఖర్ రావు, డీఎల్‌పీవో ఆదినా రి వీరభద్రప్ప, సీఐలు నిరంజన్ రెడ్డి, గోపినాథ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్

నేర చరిత్ర ఉన్న వారిని ఏజెంట్లుగా పంపొద్దు

ఆలూరు, మే 21: వచ్చే నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు నేర చరిత్ర ఉన్న వారిని, ఉద్యోగులను ఏజెంట్లుగా నియమించరాదని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్, సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవా రం తహసీల్దార్ కార్యాలయంలో అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. కర్నూలు రాయలసీ మ యూనివర్సిటీలో రూం నెంబర్ 205, 206లో కౌంటింగ్ జరుగుతుందన్నారు. మొత్తం 14 టేబు ళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రి యలో పాల్గొనే ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కౌంటింగ్ హాలుకు చేరుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అభ్యర్థులు గుర్తుం చుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, బీఎస్పీ అభ్యర్థి రామలింగ, జై భారత్ పార్టీ అభ్యర్థి షేక్షావలి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి



విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న రైతులు

ఎమ్మిగనూరు, మే 21: రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.ఎస్. అశోక్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు నేస్తం వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త అశోక్ కుమార్ నేల విత్తన పుచ్చుకుని ప్రాముఖ్యత, ఆధునిక వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. గ్రామీణ పంటల సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు డా.రమేష్ నాయక్, డా. టి. సిరి చందనలు పత్తిలో వచ్చే తెగుళ్లు, నివారణ, భూసార పరీక్షలపై వివరించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను రైతులు తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ గ్రాసం రూ.18 వేలు



గోనెగండ్ల, మే 21: ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతోంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగు చేయక పోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. గోనెగండ్ల, నందవ రం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా ఈ ఏడాది పత్తి, మిరప, వంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలామంది రైతులు గ్రాసం నీటి కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ, వంటలను రైతులు ఎక్కువగా సాగు చేయకపోవడంతో వాటి ధర విపరీతంగా పెరిగింది.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

వెల్దుర్తి, మే 21: మండలంలోని సిద్ధనగట్టు గ్రామంలో విద్యుదాఘా తానికి గుర్రె మంగళవారం గొర్రె మృతి చెందింది. గోపాల్‌కు చెందిన గొర్రెలు నీరు తాగడానికి వాగులోకి వెళ్లాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి ఒక గొర్రె మృతి చెందింది. మిగిలిన గొర్రెలు తప్పించుకు న్నాయి. రూ.15 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

వేసిన రెండు నెలలకే రోడ్డు ధ్వంసం





ధ్వంసమైన తారు రోడ్డు

మద్దికెర, మే 21: వేసిన రెండు నెలలకే తారు రోడ్డు దెబ్బతింది. తారు లేచి కంకర తేలింది. ఎన్నో ఏళ్లుగా గుంతల రోడ్డుతో ఇబ్బంది పడిన ప్రజలు కొత్త రోడ్డు మంజూరు కావడంతో గతుకుల ప్రయాణం ఇక తప్పినట్లేనని ఊపిరి పీల్చుకున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు గత రెండు నెలల కిందట తారు రోడ్డు పనులను పూర్తి చేశారు. ఆయితే.. ఈ రోడ్డును ఎవరైనా తవ్వారా.. లేకా బలమైన భారీ వాహనాలు తిరిగడం వల్లే తారు లేచిపోయిందా అన్న సందేహం కలుగుతోంది. మద్దికెర నుంచి వయా మొలగవెల్లి మీదుగా వెళ్లేందుకు తారు రోడ్డు వేయడానికి రూ.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సదరు పనులను దక్కించుకున్న కాంట్రాక్టరు రెండు నెల కింద తారు రోడ్డు పనులను పూర్తి చేశారు. ఎన్నికల సమయం కావడంతో అధికార పార్టీకి లాభం కలగాలనే ఉద్దేశంతో వేగంగా పనులు పూర్తి చేశారు. ఆయితే, పనుల్లో నాణ్యత కొరవడినట్లు దెబ్బతిన్న రోడ్డును చూస్తే తెలిసిపోతుంది. పలు చోట్ల రోడ్డుపై తారు లేచిపోయింది. ఆయితే ఎవరైనా ప్రొక్లెయిన్ ద్వారా తవ్వారా.. లేక భారీ వాహనాల వల్ల దెబ్బతిన్నదా అన్న విషయం తేలాల్సి ఉంది. ఆ ప్రాంత మంతా నల్లరేగడి ప్రాంతం కావడం వల్ల తారు రోడ్డు నిలబడదని ప్రజలు అంటున్నారు. ఆయితే.. సదరు కాంట్రాక్టరు నాసిరకం పనులు చేయడం వల్లనే ఆ రోడ్డు తారు లేచిపోయి ఉంటుందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఏదేమైనా తారు రోడ్డు వేసిన రెండు నెలలకే ధ్వంసం కావడం విమర్శలకు తావిస్తోంది.

గ్రామాల్లో కనిపించని పారిశుధ్య పనులు

దేవనకొండ, మే 21: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు అటకెక్కాయి. నిర్వహణ నిధుల లోపంతో గ్రామాలలోని వీధుల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మండలంలోని బండపల్లి, జేతపల్లి, బంటుపల్లి, గుడిమిర్ల, పి.కోటకొండ గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజిలు లేక ఇళ్ల ముందే మురుగు నిలుస్తోంది. దీంతో దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ పనులు చేపట్టలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాలలో సీసీ రోడ్లు వేసినా మురుగు కాలువలు ఏర్పాటు చేయ లేదు. దీంతో నడిరోడ్డుపైనే మురుగు ప్రవహిస్తూ దుర్గంధం మారాయి. సీజన్ మారుతుండటంతో గ్రామాల్లో మురుగుతో రోగాలు ప్రబలే పరిస్థితులు ఉన్నాయి.

నిస్వార్థంగా పని చేయడం అభినందనీయం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, మే 21: ఎన్నికల్లో కమ్యూ నిస్టు శ్రేణులు నిస్వార్థంగా పని చేయడం అభినందనీయమని పత్తికొండ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య అన్నారు. మంగళవారం స్థానిక గోపాల్ ప్లాజాలో పత్తికొండ నియోజక వర్గ ఇండియా కూటమి అభ్యర్థి రామచంద్రయ్య విజయాన్ని కాంక్షిస్తూ.. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయం కోసం కృషి చేసిన సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రామచంద్ర య్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, శేఖర్, జిల్లా కార్యదర్శి గిడ్డయ్యలు హాజరై ప్రసంగించారు. కర్నూలు జిల్లాలో పత్తి కొండ నియోజకవర్గం కమ్యూనిస్టులకు కంచుకో టగా ఉండని గుర్తు చేశారు. భూపోరాటాలు సాగించి గుడిసెలు వేయించి ఈ ప్రాంతంలో పలు కాలనీలను ఏర్పాటు చేసిన చరిత్ర సీపీఐ కే ఉందన్నారు. ప్రస్తుతం డబ్బుతో కూడిన రా జకీయాలు నడుస్తున్న తరుణంలో కమ్యూని స్టులు పోటీ చేయడమే ఒక గొప్ప పరిణామమ ని, ఈ ఎన్నికల్లో పార్టీ వెంట నడిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు భీమలింగప్ప, నబీరసూ ల్, సీపీఎం నాయకులు రంగారెడ్డి, జిల్లా నాయ కులు రామకృష్ణారెడ్డి,రంగన్న, బొంతి రాళ్ల సర్పం చ్ రవిమోహన్, తుగ్గలి, మద్దికెర కార్యదర్శులు సుల్తాన్, నాగరాజు, ప్రజా సంఘాల నాయకు లు డా.వలిసాహెబ్, అడ్వకేట్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

మద్దికెర, మే 21: సీపీఐలో పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటానని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు, ఇండియా కూటమి పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి పి.రామచంద్రయ్య అన్నారు. మాజీ మండల సీపీఐ కార్యదర్శి పి.వలిసాహెబ్, మహబూబ్‌బీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, పెరవలి సుధాకర్, పాపన్న, కరుమంచి, కోదండ రాముడు, రంగస్వామి పాల్గొన్నారు.

వివరాల సేకరణలో అలసత్వం వద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏవో వెంకట్రాముడు

పత్తికొండ, మే 21: ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమయ్యే రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పత్తికొండ మండల వ్యవసా యాధికారి వెంకట్రాముడు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు అవసరమ య్యే విత్తనాలు, ఎరువులు తదితర విషయాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక పంపా ల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2,850 టన్ను లు వేరుశనగ విత్తనాలు అవసరం ఉందని ముందస్తు నివేదికలు పంపా మని చెప్పారు. అందులోభాగంగా జిల్లా అధికారులు మొదటి విడతగా 1,000 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించారన్నారు. వేరుశనగ విత్తనాలు క్వింటం ధర 9,500 కాగా ప్రభుత్వం 40శాతం సబ్సిడీ భరిస్తోందని తెలిపారు. సబ్సిడీ పోను క్వింటం విత్తనాలకు రైతులు 5,700 చెల్లించాలన్నారు.

● **పత్తికొండ టౌన్:** ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు పలు రకాల సాగు విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వెంకట్రాముడు, పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్ ఫర్టిలైజర్ యజమానులను హెచ్చరించారు. మంగళవా రం పట్టణంలోని పలు సీడ్స్, ఫర్టిలైజర్ షాపులను వారు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం

తుగ్గలి, మే 21: భూ రీసర్వేతో రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని తెలుగు యువత నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్, లక్ష్మన్న స్వామి, రవి యాదవ్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జొన్నగిరిలో వారు మాట్లాడుతూ మండలంలో భూ రీసర్వేతో రైతుల భూములను మాయం చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారని అన్నారు. రైతులకున్న రికార్డుల ప్రకారం వారి పొలాలకు కచ్చిత మైన సరిహద్దులను గుర్తించి ఇవ్వాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

25న మండల సమావేశం

పత్తికొండ టౌన్, మే 21: పత్తికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న జరుగుతుందని ఎంపీడీవో రామారావు తెలిపా రు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25 శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీపీ హాలు నందు మండల మీట్ సమావేశం ఎంపీపీ నారాయణ దాసు అధ్యక్షతన జరుగుతుందని అన్నా రు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచులు, ఆయా శాఖ అధికారు లు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

మద్దికెర, మే 21: మండలంలో గత ఏడాది రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరాముడు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల గత ఏడాది పంటలు సాగు చేయలేదని చెప్పి పరిహారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గత రెండేళ్లుగా రబీలో సాగు చేసిన పంటలకు పరిహారం రాలేదని తెలిపారు. ప్రభుత్వం రాయితీ కింద ఇస్తున్న వేరుశనగ విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, మే 21: మండలంలో వారం రోజుల నుంచి అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయని.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ నిరంజన్‌బాబు, హెల్త్‌ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురవడం వల్ల పాత నీరు, కొత్త నీరు కలుస్తుందని, అందువల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ నీటిని వడబోసి వేడి చేసి తాగాలని సూచించారు. ఏమైనా వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్యశాలకు రావాలన్నారు.

కోటకొండలో మద్యం పట్టివేత

దేవనకొండ, మే 21: జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు పి.కోటకొండ గ్రామంలో పోలీసులు విస్తృత దాడులు చేశారు.గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించగా ఒక వ్యక్తి ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, తెలంగాణకు చెందిన 25 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

దేవనకొండ, మే 21: ఉపాధి హామీ పథకంలో వందశాతం సబ్సిడీ తో పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఏపీవో కృష్ణమూర్తి తెలిపారు. దాదాపు 20 రకాల పండ్ల, పూల తోటల సాగుకు ఉపాధి హా మీ పథకంలో రైతుల దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొక్కలు నాటినప్ప టి నుంచి వాటి సంరక్షణకు మూడేళ్ల వరకు నిధులు వస్తాయన్నారు. పండ్ల తోటల సాగుతో రైతులు అభివృద్ధి చెందవచ్చన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆజాద్

హొళగుంద, మే 21: మండల సర్వసభ్య సమావేశం నామమాత్రం గా జరిగింది. మంగళవా రం హొళగుంద మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎటువంటి చర్చ ఉండదని, తీర్మానా లు చేయడానికి వీలు లేదని ఎంపీడీవో ఆజాద్ అన్నారు. ఐదు నిమిషాల వ్యవధిలో సమావేశా న్ని ముగించేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆజాద్, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్, పీఆర్ ఏఈ సోమప్ప, ఎంఈవో జగన్నాథం, అగ్రికల్చర్ ఏవో ఆనంద్, లోకల్ ఏఈడీఎస్ సూపర్‌వైజర్ పీరాజాబీ పాల్గొన్నారు.

కొల్లి ఆశయ సాధనకు కృషి చేయాలి



కొల్లి నాగేశ్వరరావుకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, మే 21: రైతు ఉద్యమ నేత, రైతుల కోసం జీవి తాంతం పనిచేసిన కొల్లి నాగేశ్వర రావు ఆశయ సాధనకు కృషి చేయా లని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పంపన్న గౌడ్ అన్నారు. పట్ట ణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం కొల్లి నాగేశ్వరరావు వర్ధం తిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళి అర్పించారు. కొల్లి నాగేశ్వరరావు జీవితాంతం రైతాంగ సమస్యలపై ఉద్యమించారని కొనియాడారు. కార్యక్రమంలో టీటీ చిన్నన్న, వీరేష్, శాంతన్న, నరసింహులు, తిమ్మప్ప, రవి పాల్గొన్నారు.

మారెమ్మ దేవి ఆలయంలో శాంతి యజ్ఞం

పెద్దకడుబూరు, మే 21: మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని మారెమ్మదేవి ఆలయంలో గత మూడు రోజుల నుంచి శాంతి యజ్ఞహో మాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వేద పండితులచే అమ్మవారికి జలాభిషేకం, వస్త్రాభరణం, కుంకుమా ర్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి దూప, దీప నైవేద్యాలు సమర్పించి, యజ్ఞ హోమం చేసి, పూర్ణాహుతి వంటి హోమాలు వేదపండితులు కొనసాగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమము చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ వీఆర్‌వో రామలింగా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, బ్రహ్మయ్యచారి, కేశవాచారి, పూజారి నరసింహ, పెద్ద లక్ష్మ మ్మదేవి, ఆలయ పూజారి విశ్వబ్రాహ్మణ నరసింహాచారి పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి



మురికి కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, మే 21: మేజర్ పంచాయతీలో ప్రజలు, వ్యాపారులు ఈ నెల 30 తేదీ లోపు ఇంటి పన్నులు, కొళాయి పన్ను, దుకాణాల పన్నులు చెల్లించాలని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సతీష్ కోరారు. మంగళ వారం గ్రామంలోని వీధుల్లో ఆయన పర్యటించారు. ఇప్పటి వరకు గోనె గండ్లలో 70 శాతం పన్నులు వసూలయ్యాయని తెలిపారు. మిగతా 30 శాతం ఈ నెలాఖరు లోపు చెల్లించాలని కోరారు. అనంతరం వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుభాన్ పాల్గొన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, మే 21: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం లో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభి షేకం నిర్వహించారు. మంగళవారం వైశాఖ త్రయోదశి శుభ సందర్భా న్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలతోపాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● మంత్రాలయం మండలంలోని మాధవరంలో వెలసిన లక్ష్మీనర సింహ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషే కాది పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పైబాది నర్సిరెడ్డి, శ్రీనివా సులు, మోహన్, రామపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాచోటి స్వామి 258వ ఆరాధన

ఆదోని టౌన్, మే 21: పోత్ మఠంలోని గురురాచోటి స్వామి 258వ పుణ్య ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వా హకులు తెలిపారు. ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తా మని చెప్పారు. అనంతరం శ్రీమాన్ మహారాజ్ నిరంజన్ జగద్గురువు, చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి (ఊరుగూడి గవిమఠం సంస్థానం), మహంత మహా స్వామి (చరగిరి సంస్థానం), మల్లికార్జున స్వామి (జలగురుగు మఠం), వివిధ మఠాధిపతులచే ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం'

ఆలూరు, మే 21: ఏపీలో చంద్రబాబు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయ డం ఖాయమని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళ వారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ్ మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టారని ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్‌రెడ్డి, నేమేకల్ రవి యాదవ్, టీడీపీ నాయకులు మొలగవల్లి సీనప్ప, శరణప్ప, మారుతి, మహేష్, కాశిం, కేశన్న, అంజనేయ, హనుమప్ప పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను అందిస్తున్న మాజీ కౌన్సిలర్ మారుతి

ఆదోని టౌన్, మే 21: పట్టణంలోని లక్ష్మమ్మ అవ్వ నగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లమ్మ అనే పేద మహిళలకు ఇందిరానగర్‌కు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మారుతి మంగళవారం నిత్యావసరాలను అందజేశారు. ప్రేమించి పెళ్లి చేసుకొన్న భర్త కనిపించకుండా పోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఎల్లమ్మ దీన పరిస్థితిని గమనించి స్థానికులు సమాచారం అందించడంలో స్పందించిన మారుతి 25 కేజీల బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలను అందజేసి ఆదుకొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఆస్పరి, మే 21: మండల పరిధిలోని చుక్కనహళ్లి గ్రామ సమీపంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప మంగళవారం తెలిపారు. పత్తికొండ మండలం అటికలగుండు గ్రామానికి చెందిన అయ్యన్నపై వ్యక్తిగత కక్షతో, అదే గ్రామానికి చెందిన మస్తాన్, రమేష్‌లతో పాటు మరికొందరు ఆస్పరి మండలం చొక్కానహళ్లి గ్రామ సమీపంలో దాడి చేశారు. గాయపడ్డ అయ్యన్నను ఆదోని ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్, మే 21: క్షయవ్యాధితోపాటు ఇతర వ్యాధులు సంక్రమిం చకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీబీ యూనిట్‌కు చెంది న డా. హర్షిక, డా. అనిల్ సాగర్, డా. మహేష్‌బాబు, డా. షాహిదా బేగం అన్నారు. మంగళవారం ఇందిరానగర్, హవన్నపేట, శంకర్‌నగర్ ప్రాంతా ల్లోని మ్యాక్ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనారోగ్య బాధలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకుని, ప్రారంభ దశలోనే సరైన చికిత్స తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ బాబురావు, సుబ్బమ్మ బాయి, లలిత, హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.